సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం । 21 । జూలై । 2025



అరాచకపాలన రాజ్యామేలుతోంది

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అరాచకపాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి ఏకుల రాజేశ్వరి రెడ్డి విమర్శించారు. -8లో



స్టాపింగ్ కోసం నిరీక్షణ!

ఓబులవారిపల్లె మండల కేంద్రంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు స్టాపింగ్ ఎత్తివేసి ఐదు నెలలైంది. అధికారులు, నేతలు స్టాపింగ్ పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవడం లేదు. -8లో

గరిష్టం/కనిష్టం
34.5/24.2

వాతావరణం

జిల్లాలో ఆదివారం 24.2 - 34.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జర్నలిజం కోర్సులో నేరుగా ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లమో కోర్సులలో ప్రవేశానికి ఈ నెల 21 నుంచి 31 తేదీ వరకు నేరుగా ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రవేశాల సంచాలకులు డాక్టర్ టి. లక్ష్మీప్రసాద్ తెలిపారు.జర్నలిజం శాఖ ఆధ్వర్వంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లామా ఇన్ పబ్లిక్ రిలేషన్ (పీజీడీపీఆర్), పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లామా ఇన్ తెలుగు జర్నలిజం (పీజీడీటీజే), ఫైన్ ఆర్ట్స్ శాఖ ఆధ్వర్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమా ఇన్ థియేటర్ ఆర్ట్స్ కోర్సులకు ప్రవేశాల కౌన్సెలింగ్ జరగనుందని తెలిపారు. పీజీ డిప్లొమా కోర్సులలో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తర్ణీత సాధించినవారు అర్హులని చెప్పారు. వివరాలకు www.yvu.edu.in ను సందర్శించాలని ఆయన సూచించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కడప సెవెన్‌రోడ్స్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సోమవారం సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు.

● ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. తాము అందజేసిన అర్జీలు పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నెంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు.

● డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు.

'పాలకొండ'లో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ఆలయ ఆవరణాన్ని శుభ్రపరుస్తున్న దృశ్యం

కడప వైఎస్ఆర్ సర్కిల్: శ్రావణమాసం ఉత్సవాల సందర్భంగా కడప నగర శివార్లలోని శ్రీ పాలకొండ్రాయస్వామి ఆలయంలో ఆదివారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. గర్భాలయం, అంతరాలయం,షోడశ మండపం, ఆలయ ప్రాంగణం, ప్రాకారపరిసరాలను ఆలయ సేవకులు, అధికారులు శుభ్రపరిచారు. ఆలయ పరిసరాలలో ఉన్నటువంటి చిన్న కోనేరు ,పెద్ద సెలయేరు, ఆలయ చుట్టుపక్కల పరిసరాలలో ఉన్నటువంటి అపరిశుభ్ర వ్యర్థాలను తొలగించి ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కడప నగరానికి చెందిన శ్రీ భువనేశ్వరి మాత సేవా సమితి సేవకులు, శ్రీ సుముఖీ అన్నపూర్ణేశ్వరి సేవా సమితి సభ్యులు,ఆలయ అర్చకులు యోగేశ్వర శర్మ, ఆలయ చైర్మన్ రెడ్డయ్య యాదవ్, స్వామివారి భక్తులు పాల్గొన్నారు.

పిల్లల్లో ఎదుగుదల లోపాలపై నిర్లక్ష్యం తగదు



పిల్లల ఎదుగుదల లోపాలపై తల్లులకు సూచనలిస్తున్న చైల్డ్ సైకాలజిస్ట్ సోమశేఖర్

కడప కోటిరెడ్డిసర్కిల్: పిల్లల్లో ఎదుగుదల లోపాలను ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిదని, ఈ విషయంగా నిర్లక్ష్యం తగదని ప్రముఖ చైల్డ్ సైకాలజిస్ట్ సోమశేఖర్ తెలిపారు. ఆదివారం కడప పట్టణంలోని ఐఎంఏ హాలులో ఆర్టిజం స్పెక్ట్రం డిసార్డర్ అనే అంశంపై అషూర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆటిజం పిల్లలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 నెలలు నిండిన వెంటనే పిల్లల ప్రవర్తన, ఎదుగుదల, మాటలు వంటి వాటిని తల్లిదండ్రులు పరిశీలించాలని, ఏమాత్రం తేడా ఉన్న వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అర్జున్ , రిమ్స్ పీడియాట్రిక్ హెచ్ ఓ డి డాక్టర్ వంశీధర్, ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు ఓబుల్ రెడ్డి మాట్లాడారు. రత్న స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్ స్పీచ్ థెరపిస్టులు బాబురావు, ప్రవల్లిక అషూర్ సంస్థ ప్రతినిధులు న్యాయవాది కిషోర్ కుమార్, నాగరాజు, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇదేం పాలన బాబూ!

● 8 రోజులుగా వీధి దీపాల నిర్వహణ బంద్.. నీటి సరఫరా అంతంతే!
● సాయంత్రమైతే చాలు అంధకారంలో కూరుకుపోతున్న సర్కిళ్లు
● కార్మికుల సమ్మెను పట్టించుకోని ప్రభుత్వం
● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



చీకట్లలో కడప ఏడు రోడ్ల కూడలి

కడప కార్పొరేషన్: కుళాయిల్లో నీళ్లు రావడం గగనమైంది.. ఆరు దాటిందంటే చాలు చీకటి కమ్ముకుంటోంది. ఇంకేముంది ఓ వైపు ఈగలు,దోమల తాకిడి.. మరోవైపు విష పురుగుల అలికిడి.. ఇదీ వారం రోజులుగా ప్రజల దుస్థితి. కూటమి పాలన అధ్వాన తీరిది. ఒకటా రెండా 8 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేకుండా పోయింది. దీనికి తోడు కార్మికుల సమ్మెకు పారిశుధ్య కార్మికులు కూడా మద్దతివ్వడంతో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది.

● తమ డిమాండ్లు పరిష్కరించాలని మున్సిపల్ కార్మి కులు చేస్తున్న సమ్మెను ప్రభుత్వం తేలిగ్గా తీసుకున్నట్లు కనిపిస్తోంది. సుమారు నెల రోజుల నుంచి వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్న కార్మికులు ఈ నెల 12వ తేది అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్లారు. 8 రోజులుగా వారు తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి సేవలు బంద్ చేసి సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదనే విమర్శలు వస్తున్నాయి. 12 నుంచి ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెలోకి వెళ్లగా 16 నుంచి పారిశుధ్య కార్మికులు కూడా వారిని అనుసరించారు. కడప మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేల్ మున్సిపాలిటీల్లో కార్మికులు సమ్మె చేస్తున్నారు. కడపలో 344 మంది ఇంజినీరింగ్ కార్మికులు, 664 మంది పారిశుధ్య కార్మికులు సమ్మెలోకి వెళ్లగా, జిల్లా వ్యాప్తంగా సుమారు 1500 మంది సమ్మె చేస్తున్నట్లు తెలుస్తోంది. సమ్మె ప్రభావంతో ఆయా పట్టణాల్లో ఆదివారం తీవ్ర తాగునీటి సమస్యలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా కడప నగరంలో కొళాయిల్లో నీటి సరఫరా కాకపోవడంతో ప్రజలు ప్రైవేటు ట్యాంకర్ల కోసం వెంపర్లాడుతున్న పరిస్థితి ఉంది. గండి, లింగంపల్లి పంపింగ్ స్కీంల నుంచే కడప నగరానికి ప్రధానంగా తాగునీటి సరఫరా అవుతుంది. సచివాలయ ఉద్యోగుల ద్వారా తాత్కాలిక సిబ్బందిని నియమించుకొని తాగునీటిని సరఫరాకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ అవి సత్ఫలితాలు ఇవ్వలేదని తెలుస్తోంది. వాల్వ్‌లు తిప్పి నీటిని విడుదల చేసిన తర్వాత మళ్లీ ఎవరూ వాటిని ఆఫ్ చేయకపోవడంతో చాలాచోట్ల తాగు నీరు వృథాగా పోతున్న పరిస్థితి ఉండగా, మరికొన్ని ప్రాంతాలకు నీరే సరఫరా కాని పరిస్థితి ఉంది. ముఖ్యంగా కడప నగరంలోని గంజికుంట కాలనీ, గౌస్ నగర్ వంటి ప్రాంతాల్లో చుక్క నీరు రాక ప్రజల్లో తీవ్ర అసహనం నెలకొంది.

అంధకారంలో పట్టణాలు

మున్సిపల్ కార్మికుల సమ్మె వల్ల కడప కార్పొరేషన్‌తోపాటు ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేల్ పట్టణాల్లో అంధకారం నెలకొంది. ప్రతిరోజూ సాయంత్రం వీధి దీపాలు ఆన్ చేసి, ఉదయం 6 గంటలకు ఆఫ్ చేసే వారు లేకపోవడంతో ప్రధాన వీధుల్లో కూడా చిమ్మ చీకటి ఏర్పడింది. అక్కడక్కడ మాత్రమే లైట్లు ఆన్ చేస్తున్నారుగానీ, అధిక శాతం ప్రాంతాలు కటిక చీకటిలోనే మగ్గుతున్నాయి. అలాగే మరమ్మతులకు గురవుతున్న వీధి దీపాలను సరిచేసే వారు కూడా కరువయ్యారు. వీధి దీపాలు వెలుగుతున్న చోట 24 గంటలు వెలుగుతూనే ఉండగా, కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా వెలగని పరిస్థితి ఉంది. మరోవైపు పారిశుధ్య కార్మికులు కూడా సమ్మెలో పాల్గొనడం వల్ల ఆయా పట్టణాల్లో పారిశుధ్యం కూడా అధ్వానంగా మారింది. సమ్మె ప్రభావం కనబడనీయకుండా ప్రధాన రహదారుల్లో మాత్రమే చెత్తను ఎత్తుతున్నారే తప్పా అనేక కాలనీల్లో వీధుల్లో చెత్త ఎత్తేవారు కరువయ్యారు.



అంధకారంలో అన్నమయ్య సర్కిల్



ఒంటికాలిపై నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

ఒంటికాలిపై నిరసన

కడప కార్పొరేషన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఆదివారం కార్మికులు ఒంటికాలిపై నిల్చొని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తాము గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 36 ప్రకారం వేతనాలు అమలు చేయాలని మాత్రమే కోరుతున్నామన్నారు. తక్కువ వేతనాలు తీసుకుంటున్న కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే సోమవారం నుంచి సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు ఎస్. రవి, గోపి, కె. శ్రీరామ్, కిరణ్, శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరుచుకోవాలి

రాజంపేట టౌన్: విద్యార్థులు ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని అలవరుచుకుంటే చదువులో రాణించగలరని ప్రేమ్‌చంద్ హిందీభవన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సర్తాజ్ హుస్సేన్ తెలిపారు. ఈనెల 31వ తేదీ ప్రముఖ హిందీ నవలాకారుడు ప్రేమ్‌చంద్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం స్థానిక బీవీఎన్ పాఠశాలలో విద్యార్థులకు ప్రేమ్‌చంద్‌కి జీవని అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా సర్తాజ్ హుస్సేన్ మాట్లాడారు. ప్రతి విద్యార్థి పోటీ పరీక్షల్లో పాల్గొనాలన్నారు. అప్పుడే తమలోని ప్రతిభ ఏమిటన్నది తెలుస్తుందన్నారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తనే విషయాన్ని విద్యార్థులు గుర్తుంచుకోవాలని సూచించారు.

మహాసభలను జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్: కడప నగర వేదికగా సెప్టెంబర్ 12,13,14 తేదీలలో నిర్వహించనున్న అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బి) 9వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు ఎమ్మెల్సీ రామచంద్ర రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కడప నగరంలోని సెవంత్ కేఫ్ మిని హాల్లో జాతీయ మహాసభలకు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సమాజంలో విద్యార్థి సంఘాల పాత్ర చాలా కీలకమైనదన్నారు. అఖిల భారత విద్యార్థి బ్లాక్ జాతీయ మహాసభలు కడప నగర వేదికగా జరుగుతున్న శుభ సందర్భంగా విద్యావంతులు మేధావులు, విద్యార్థులు యువకులు పాల్గొని జయప్రదం చేయాలని వారు తెలుపునిచ్చారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు పి.వి.సుందర రామరాజు, ఆహ్వాన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ మాట్లాడారు. ఏఐఎస్‌బీ నాయకులు పాపి రెడ్డి పల్లి పఠ్వి,రాజేంద్రప్రసాద్ మనోజ్,చిరంజీవి, విష్ణు,కిరణ్ పాల్గొన్నారు.



మహాసభల లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి తదితరులు

నిరసన గళం!

● ఎంపీ మిథున్‌రెడ్డిపై తప్పుడు కేసు నమోదుపై ఆగ్రహం
● కూటమి వైఖరిని తప్పుపట్టిన నేతలు
● పెద్దిరెడ్డి కుటుంబానికి అండగా వైఎస్సార్ సీపీ శ్రేణులు



కలికిరి మండలంలో ఎంపీ అరెస్టుకు నిరసన తెలియచేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లా రాజంపేట పార్లమెంట్‌కు సంబంధించి ఓటమి లేకుండా వరుస గెలుపులతో రికార్డు సృష్టిస్తున్న పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై అధికార పార్టీ కన్నుపడింది. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ కీలక నేతలను మద్యం కేసు పేరుతో అరెస్టు చేసి పలువురిని జైలుకు పంపిన విషయం అందరికీ తెలిసిందే. అయితే రాయలసీమలో రాజకీయంగా మంచి పట్టు ఉన్న పెద్దిరెడ్డి కుటుంబంపై కక్షపూరితంగా ప్లాన్ చేసి ఇరికించారు. అంతకు ముందు జిల్లాలోని మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దగ్ధం కేసులోనూ ఎంపీ మిథున్‌రెడ్డి కుటుంబాన్ని ఇరికించేలా పన్నాగం పన్నారు. అయితే అప్పట్లో సీఎంఓ ఆదేశాలతో సీఐడీ విచారణ చేసినా పెద్దగా ఫలితం లేకపోవడంతో మద్యం కేసులో అక్రమ కేసు పెట్టి అరెస్టు చేయడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా విచారణ అనంతరం ఎంపీని అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించడంపై జిల్లాలో పార్టీ శ్రేణులు నిరసన తెలియజేశారు.

పార్టీ శ్రేణుల్లో ఆగ్రహావేశాలు

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టుపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు కూటమి సర్కార్‌పై రగిలిపోతున్నాయి. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు కలకలం రేపింది. పార్టీ శ్రేణులు ఇతర నేతలంతా సీఐడీ విచారణకు హాజరైనా తిరిగి పంపిస్తారనుకునే లోపే అరెస్టు ప్రకటన అలజడి సృష్టించింది. వైఎస్ఆర్‌సీపీ నాయకులను ఒక్కొక్కరినీ అరెస్టు చేస్తుండటంతో ఆగ్రహం మీద ఉన్న పార్టీ శ్రేణులకు ఎంపీ అరెస్టును జీర్ణించుకోలేకపోతున్నారు. ఎవరు వెళ్లినా అందరినీ ఆప్యాయంగా పలుకరించి కష్టసుఖాల్లో పాలుపంచుకునే ఎంపీని అరెస్టు చేయడంపై పార్టీ శ్రేణులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నాయి. మొత్తం మీద ఎంపీ అరెస్టుపై పార్టీ శ్రేణులు తీవ్రంగా ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నాయి.

కక్షసాధింపునకు పరాకాష్ట



కూటమి ప్రభుత్వం ఒక దుష్ట సాంప్రదాయాన్ని ప్రారంభించింది. మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్ రాజకీయ కక్షసాధింపునకు పరాకాష్ట. రాష్ట్రంలో నియంతృత్వ రాక్షస పాలన కొనసాగుతోంది. ఇంకా కొనసాగితే ఏ మాత్రం సహించేది లేదు. ప్రభుత్వ తీరును కచ్చితంగా ప్రజల్లో ఎండగడతాం.


– ఎస్‌బీఅంజాద్ బాషా, మాజీ డిప్యూటీ సీఎం

చిరంజీవై.. వర్ధిల్లు!

సీతమ్మవారి కోరికతో
శ్రీరాముడు చెక్కిన పవిత్ర విగ్రహమది..
ఆంజనేయుడు చిరంజీవిగా
వర్ధిల్లుతున్న క్షేత్రమది...
కొండకు గండికొట్టి.. పాపాలను హరిస్తూ
ప్రవహించే పుణ్యనదీ తీరమది..
బంగారు తోరణం కొలువై ఉన్న ప్రాంతమది..
భక్తుల కొంగుబంగారంగా
విలసిల్లుతున్న ఆధ్యాత్మిక ఆలయమది..
అదే గండి క్షేత్రం. శ్రావణం వస్తున్న వేళ ..
అంజన్న ఆలయం ఉత్సవాలకు
ముస్తాబవుతోంది.



గండి వీరాంజనేయస్వామి మూల విరాట్



గండి వీరాంజనేయ స్వామి సన్నిధి

● గండి ఉత్సవాలకు వేళాయె!
● మొదలైన ఉత్సవ సందడి
● ఏర్పాట్లు చేపట్టిన ఆలయ వర్గాలు



చక్రాయపేట: శుభాల శ్రావణ మాసం వచ్చేస్తోంది. ఈమాసం అంటే ఆంజనేయుడికి ప్రీతికరం. అలాగే ఆయన భక్తులకు కూడా ఈ మాసమంటే ఎంతో ఇష్టం. శ్రావణమాసం వచ్చిందంటే చాలు ఆంజనేయ స్వామి గుళ్లు పత్యేక అలంకరణకు నోచుకుంటాయి. ఇక రాయలసీమ జిల్లాల్లో గండి వీరాంజనేయ స్వామి ఆలయానికి ఓ ప్రత్యేకత ఉంది. అవును.. ఇక్కడి వీరాంజనేయ విగ్రహాన్ని స్వయంగా శ్రీరామ చంద్రమూర్తి తన స్వహస్తాలతో చెక్కడంతోపాటు ఆయనే ప్రతిష్ఠించారని ప్రతీతి. దీంతో భక్తులు ఇక్కడి స్వామికి ఎంతో భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారు.

సీతమ్మ తల్లి కోరిక తీర్చడం కోసం..

రావణున్ని సంహరించిన అనంతరం సీతా సమేతుడైన శ్రీరామచంద్రుల వారు అయోధ్యకు తిరిగి వెళుతున్న సమయాన గండి క్షేత్రానికి వచ్చే సరికి చీకటి పడిందట. ఈ సమయంలో సేద తీరుతున్న సీతమ్మ తల్లి అక్కడ కొండకు కనిపించిన పెద్ద రాయిని చూసి శుభగడియలు ముగిసేలోపు ఆంజనేయుడి విగ్రహాన్ని బాణపు ములికితో చెక్కాలని కోరిందట. దీంతో శ్రీరాముడు ఆమె కోరిక మేరకు ఆంజనేయుడి విగ్రహాన్ని చెక్కడం ప్రారంభించారు. శుభగడియలు ముగిసే సరికి ఆంజనేయుడి ఎడమచేయి చిటికెన వేలు కొదవ పడింది. అంతటితో ఆపేసి విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశాడు.

● కాలక్రమంలో పూర్వీకులు భిన్నంగా ఉన్న విగ్రహం పూజలకు పనికి రాదని భావించి చిటికెన వేలిని చెక్కించేందుకు శిల్పిని రప్పించారు. స్వామి వారి చిటికెన వేలు చెక్కాలని సూచించారు. ఇందుకు ఉపక్రమించిన శిల్పి ఉలి దెబ్బ వేయగానే అక్కడ నుంచి రక్తం వచ్చిందట. దీంతో ఆ ప్రయత్నాన్ని పూర్వీకులు విరమించుకున్నారు. సీతాదేవి ఆంజనేయుడిని చిరంజీవిగా వర్ధిల్లు అని ఆశీర్వదించినట్లుగా గుర్తుకు రావడంతో స్వామి వారు ఇక్కడ సజీవంగా ఉన్నాడని భావించి అప్పటినుంచి పూజలు చేయడం ప్రారంభించారు.


గండి అంటే..

గండిలో ఉన్న కొండలను శేషాచల కొండలు అంటారు. ఇవి తిరుమల నుంచి గండి వరకు మధ్యలో ఎక్కడేగాని తెగకుండా ఉన్నాయట. అలాంటి ఈ శేషాచల కొండలను పాపాఘ్ని నది మధ్యలో గండి పెట్టడంతో ఈ ప్రాంతానికి గండి అని పేరు వచ్చిందంట. ఇక్కడ వెలసిన స్వామిని గండి వీరాంజనేయస్వామి అని పిలుస్తారు.

బంగారు తోరణం

గండిలో తపస్సు చేసుకుంటుండిన వాయుదేవుడు సీతారాముల వారు లంక నుంచి వస్తున్న విషయం తెలిసి రెండు కొండల మధ్యన బంగారు తోరణం నిర్మించి వారికి స్వాగతం పలికాడట. ఆ బంగారు తోరణం నేటికి కూడా ఉందని భక్తుల నమ్మకం. అది పుణ్యాత్ములకు మాత్రమే కనిపిస్తుందట. ఇప్పటివరకు ఆ తోరణం కొందరికి మాత్రమే కనిపించిందట. వారిలో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంగా ఉన్న సమయంలో కడప జిల్లా కలెక్టరుగా పనిచేస్తుండిన సర్ థామస్ మన్రో ఒకరని చెబుతారు.

పాపాఘ్ని నది



పాపాఘ్ని నది కర్నాటక రాష్ట్రం కోలారు జిల్లాలోని నంది కొండల్లో పుట్టి గండి మీదుగా కమలాపురం సమీపంలోని పెన్నా నదిలో కలుస్తుంది. నంది పాద సముద్భూతా పాపాఘ్ని పుణ్యదాయినీ అని వాయు పురాణం చెప్పింది. అందువల్లే ఈనది పాపాలను హరించివేస్తుందని అందుకే దీన్ని పాపాఘ్ని నది అని పిలుస్తారు. పైగా దీన్ని ఉత్తర వాహిణిగా పిలవడం కూడా ఓ ప్రత్యేకతే.

తరాలు మురిసేలా-సంస్కృతి వెలిగేలా..

తరతరాలు మురిసి పోయేలా సంస్కృతి వెలిగేలా ఆలయ పునర్నిర్మాణ పనులు గండిలో చేపట్టారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక గండిని టీటీడీలో విలీనం చేయించి ఎంతో అభివృద్ధి చేశారు. అలాగే గత ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గండి ఆలయం పునర్నిర్మానానికి రూ.28 కోట్ల మేర నిధులు మంజూరు చేయించారు. ఈనిధులతో ఆలయ పునర్నిర్మాణ పనులు సుమారు 95శాతం మేర పూర్త య్యాయి. ఆలయాన్ని పూర్తిగా కృష్ణశిల రాయితోనే నిర్మిస్తున్నారు. ఆల యంలో భక్తులు అడుగు పెట్టగానే దైవత్వం ఉట్టిపడేలా తరాలు మురిసి పోయి సంస్కృతి ఉట్టిపడుతూ చరిత్రలో నిలిచి పోయేలా ప్రతి రాయిపైనా పలు దేవతా మూర్తుల బొమ్మలు చెక్కించారు. ఆలయం నిర్మాణంలో ఉండటంతో ఇక్కడ బాలాలయం నిర్మించి ధారువుతో చేయించిన స్వామి విగ్రహాన్ని ఉంచి పూజలు చేయిస్తున్నారు.



గండిక్షేత్రంలో నిర్మాణంలో ఉన్న ప్రధాన ఆలయం

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు




ప్రమాదంలోగాయపడిన యువకులు

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండల పరిధిలోని శాటిలైట్ సిటీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులకు గాయాలయ్యాయి. చెన్నూరు సీఐ కృష్ణారెడ్డి కథనం మేరకు వల్లూరు మండలం, రామిరెడ్డి కొట్టాలకు ఇరువురు ద్విచక్ర వాహనంపై కడప వైపు వెళుతుండగా శాటిలైట్ సిటీ వద్ద డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వారు తీవ్రంగా గాయపడడంతో 108 వాహనంలో కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైంది

– ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి



ప్రతిభ చాటిన విద్యార్థికి అవార్డును అందజేస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, సీఈఓ శ్రీదేవి

కడప ఎడ్యుకేషన్ : వృత్తుల్లో కెల్లా నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడప సాయికృప నర్సింగ్ కళాశాలలో జ్యోతి ప్రజ్వలన, ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ కరోనా సమయంలో డాక్టర్లు, నర్సులు చేసిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. సాయిబాబా విద్యాసంస్థల సీఈఓ ఎంవీ శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యం పెట్టుకుని చదవాలని కోరారు. ప్రజలకు సేవచేయడానికి నర్సింగ్ వృత్తి దోహదపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ విద్యావతి మాట్లాడుతూ సాయికృప నర్సింగ్ కళాశాలలో అనేక రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్ నర్సింగ్ సూపరింటెండెంట్లు రమణమ్మ, కాంతమ్మతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లారు

ఒంటిమిట్ట : మండలంలో మంటపంపల్లి గ్రామంలోని కడప–చెన్నై జాతీయ రహదారిపై ఈనెల 18న శుక్రవారం సాయంత్రం మహిళ మెడలోని గొలుసును గుర్తు తెలియని దుండగులు లాక్కెళ్లారు. ఆదివారం బాధితురాలి ఫిర్యాదు మేరకు ఒంటిమిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు.

స్టాపింగ్ కోసం నిరీక్షణ!

- ఓబులవారిపల్లె జంక్షన్‌పై రైల్వేశాఖ శీతకన్ను
- ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ ఎత్తేయడంతో అవస్థలు
- జాతీయ స్థాయి నాయకులున్నా ఫలితం శూన్యం



ఓబులవారిపల్లెలో స్టాపింగ్ ఉన్నప్పుడు నిలిచిన రాయలసీమ ఎక్స్‌ప్రెస్ (ఫైల్)



ఓబులవారిపల్లె జంక్షన్ పేరు కూడా మార్చని రైల్వే శాఖ అధికారులు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ ఎత్తివేసి దాదాపు ఐదు నెలలు అయింది. రైల్వే అధికారులు కాని నాయకులు కాని స్టాపింగ్ పునరుద్ధరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. బ్రిటీష్ కాలం నాటి రైల్వే చరిత్ర కలిగిన ఓబులవారిపల్లె రైల్వే పరంగా జంక్షన్ కాక ముందు నుంచి దశాబ్దాలుగా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఇక్కడ స్టాపింగ్ ఉండేది. ఇక్కడి నుండి చె విలువైన కలపను చెన్నైకి రవాణా చేస్తుండేవారు. అప్పట్లో ఎలకంటి సుబ్బయ్య శ్రేష్టి అనే సామాన్య వ్యక్తి రైల్వేశాఖ అధికారులతో పోరాడి పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల చేయించారు. అప్పటి నుంచి నిరంతరాయంగా రాయలసీమ, జయంతి జనతా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇక్కడ ఆగేవి. కాలక్రమేణా వెంకటాద్రి, రాయలసీమ, హరిప్రియ ఎక్స్‌ప్రెస్‌లు ఆగేవి. టీడీపీ రైల్వే కోడూరు ఇన్‌చార్జి, రైల్వేకొడూరు ఎమ్మెల్యే, జనసేన పార్టీ, బీజేపీ జాతీయ స్థాయి నాయకులు మండల కేంద్రానికి చెందిన వారే. అయినా ఐదు నెలలుగా ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ తొలగించినా వారు ఏమీ పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

పట్టించుకోని రైల్వే శాఖ..

మండలం నుంచి చిట్వేలి, రాపూరు, వెంకటాచలం మీదుగా రైలుమార్గం ఏర్పాటు చేయడంతో ఓబులవారిపల్లె జంక్షన్ అయింది. రైల్వేపరంగా అభివృద్ధి చెందుతుందని నియోజకవర్గ ప్రజలు ఎంతో ఆశతో ఎదురు చూశారు. అభివృద్ధి మాట దేవుడెరుగు ఉన్న ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ కూడా ఎత్తివేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఈ మార్గంలో నంద్యాల మీదుగా గుంటూరుకు, రేణిగుంట మీదుగా కన్యాకుమారి, చెన్నై, విశాఖపట్టణానికి రైళ్లు నిత్యం ప్రయాణిస్తున్నాయి. అయితే చాలా ఎక్స్‌ప్రెస్ రైళ్లు రేణిగుంట, కడపలో గంటల తరబడి నిలబడుతున్నాయి. అలాంటి ఎక్స్‌ప్రెస్‌లకు రెండు నిమిషాల పాటు ఓబులవారిపల్లెలో హాల్టింగ్ కల్పిస్తే రైల్వే శాఖకు ఎలాంటి నష్టం ఉండదు. కడప నుండి హరిప్రియ ఎక్స్‌ప్రెస్ ఉదయం 4.45 నిమిషాలకు బయలుదేరి నందలూరుకు 5.10కి చేరుకుంటుంది. అక్కడ 20 నిమిషాల పాటు ఉంటుంది. రేణిగుంట నుండి తిరుమల ఎక్స్‌ప్రెస్ ఆపై గుంతకల్లుకు వెళ్లే రైలు రేణిగుంటలో 4.58కి బయలుదేరి కడపకు 7 గంటలకు చేరుకుంటుంది. అక్కడ 45 నిమిషాలు హాల్టింగ్ అనంతరం గుంతకల్లుకు బయలుదేరుతుంది. అదేవిధంగా గుంటూరు ఎక్స్‌ప్రెస్ రెండు రైళ్లు నంద్యాల రైల్వేస్టేషన్‌లో గంటకు పైగా ప్రతి రోజు నిలబడుతున్నాయి. ఇలా ఇంకా చాలా ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. వాటికి రెండు నిమిషాలు హాల్టింగ్ కల్పిస్తే రైల్వేశాఖకు నష్టం లేదకపోగా ఇంకా ఆదాయం పెరుగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఓబులవారిపల్లె జంక్షన్‌గా మారి ఐదేళ్లయినా కనీసం బోర్డులో కూడా జంక్షన్ అని పేరు మార్చలేదంటే అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతోంది.

ప్రయాణికుల అగచాట్లు

మండలంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మంగంపేట బెరైటీస్ గనులు ఉన్నాయి. ఇక్కడి నుంచి ఖనిజం విదేశాలకు ఎగుమతులు జరుగుతుంటాయి. ఏపీఎండీసీ మంగంపేట కార్యాలయంతో పాటు దాదాపు 150 పల్వరైజింగ్ మిల్లులు, చిన్న పరిశ్రమలు ఉన్నాయి. చాలామంది వ్యాపారులు రాకపోకలు సాగిస్తుంటారు. అంతే కాకుండా బొప్పాయి, అరటి, తమలపాకు, మామిడి తదితర పంటలను రైతులు సాగుబడి చేస్తుంటారు. వారు చెన్నై, ముంబై తదితర నగరాలకు నిత్యం వెళ్లాల్సి ఉంటుంది. నగరాలలో చదువుల కోసం, ఉద్యోగులు తమ విధుల కోసం రాకపోకలు సాగిస్తుంటారు. ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ తొలగించడంతో వారంతా రైల్వేకోడూరు, రాజంపేటకు వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా నియోజకవర్గంలోని వివిధ పార్టీల నాయకులు స్పందించి మండల కేంద్రంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎక్స్‌ప్రెస్‌లకు స్టాపింగ్ కల్పించాలి



ఐదు నెలలుగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలబడటం లేదు. దీంతో చాలా ఇబ్బందిగా ఉంది. ఆసుపత్రులకు తిరుపతికి, హైదరాబాదుకు వెళ్లలన్నా రైళ్లు చాలా అనుకూలంగా ఉండేవి. దూర ప్రాంతాలకు బస్సుల్లో ప్రయాణాలు సాగించలేము. ఇప్పటికైనా నాయకులు స్పందించాలి.

– ఆర్. వెంకటేష్, రైతు, వై.కోట, ఓబులవారిపల్లె.

ఎంపీ చొరవతో గతంలో స్టాపింగ్



కోవిడ్ అనంతరం స్టాపింగ్‌లు ఎత్తి వేశారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చొరవతో రైల్వే మంత్రిని కలిసి రెండు సార్లు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ కల్పించారు. ఈ విషయంపై ఎంపీ ఇప్పుడు కూడా ఢిల్లీలో రైల్వే శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ నాయకులు, రైల్వేశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

– తల్లెం భరత్ కుమార్‌రెడ్డి, డీఆర్‌యూసీసీ మెంబర్, ఓబులవారిపల్లె.

సిమెంట్ రోడ్డు ధ్వంసం చేసిన ఘటనలో టీడీపీ నాయకులపై కేసు

చాపాడు : మండల పరిధిలోని తిప్పిరెడ్డిపల్లె దళితవాడకు వెళ్లే సిమెంట్ రోడ్డు ధ్వంసం ఘటనపై పడమర అనంతపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులైన నందిమండలం మల్లికార్జునరెడ్డి, ఆయన సోదరుడు బాల సుబ్బారెడ్డి పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. తిప్పిరెడ్డిపల్లె దళితవాడకు వెళ్లేదారిలో ఐదేళ్ల క్రితం ప్రభుత్వ నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మించారని, ఈ స్థలం తమదని శనివారం మల్లికార్జునరెడ్డి, ఆయన సోదరుడు రోడ్డును తొలగించడంపై అక్కడి దళితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇరువర్గాల గొడవ

– ఇద్దరు యువకులకు గాయాలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న వైఎస్సార్ కాలనీలో ఆదివారం సాయంత్రం ఇరువర్గాలవారు గొడవపడ్డారు. దీంతో వంశీ, వలీ అనే యువకులకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మారుతీహాలు సమీపంలో నివాసం ఉంటున్న వంశీ న్యాక్ బిల్డింగ్ సమీపంలో ఉన్న ఓ యువతిని గత కొంత కాలంగా ప్రేమించాలని వేధిస్తుండేవాడు. కాలనీవాసులు అనేక మార్లు మందలించినా వినలేదు. ఈ నేపథ్యంలో వంశీ తన మిత్రులతో కలిసి ఆదివారం కాలనీలో ఉన్న యువతి ఇంటి దగ్గరకి వెళ్లి గొడవకు దిగాడు. దీంతో స్థానికుల దాడిలో వంశీ, వలీ అనే మరో యువకుడికి గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దాడి సంఘటనపై కేసు నమోదు



గ్రామంలో పికెట్ నిర్వహిస్తున్న పోలీసులు

తొండూరు : తొండూరు మండలం ఇనగనూరు గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు దస్తగిరి రెడ్డి (బాబురెడ్డి) మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఘణ మద్దిలేటి తెలిపారు. శనివారం ఇనగనూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు సమరసింహారెడ్డి, హరికిషోర్‌రెడ్డిలు ద్విచక్ర వాహనంలో పులివెందులకు వస్తుండగా అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దస్తగిరి రెడ్డి కారుతో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి రాడ్లతో దాడి చేసిన విషయం విదితమే. ఈ దాడికి సంబంధించి ఆదివారం దస్తగిరిరెడ్డితో పాటు మరి కొంత మందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

గ్రామంలో పోలీస్ పికెట్..

ఇనగనూరు గ్రామంలో దస్తగిరి రెడ్డి, బాల ఓబుల్‌రెడ్డిలు పరస్పరం దాడి చేసుకోవడం వల్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మెరకు పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రంలో అరాచకపాలన రాజ్యమేలుతోంది

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అరాచకపాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి ఏకుల రాజేశ్వరి రెడ్డి విమర్శించారు. ఆదివారం వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టడమే పరమావధిగా పెట్టుకొని ఈ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు నమోదు చేసి జైలుకు పంపి ఆనందించడం వారికి పరిపాటిగా మారిందన్నారు. లేని మద్యం కేసును సృష్టించి, తప్పుడు విచారణలు చేస్తూ రాజంపేట పార్లమెంట్ సభ్యుడు మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ఇలా విపక్ష నేతలపై కేసులు పెట్టుకుంటూ పోతే దానికి అంతే ఉండదన్నారు. రాబోవు రోజుల్లో వారు కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కోక తప్పదన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వానికి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే వారు ప్రజా సేవ చేయకుండా, సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ప్రతిపక్ష పార్టీలపై తప్పుడు కేసులతో వేధించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత వస్తోందన్నారు. దాన్నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ వేధింపులు భరించలేక, వారు చెప్పినట్లు అక్రమాలు చేయలేక నిజాయితీ కలిగిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు స్వచ్ఛందంగా రిటైర్‌మెంట్ ప్రకటించడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. అక్రమ అరెస్టులతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను భయపెట్టలేరన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

హామీలు కొండంత, చేసింది గోరంత

కూటమి ప్రభుత్వంపై యూటీఎఫ్ నేతల విమర్శ



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు కొండంత అని, చేసింది గోరంత మాత్రమేనని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబులు విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించుకుంటే పోరుబాట తప్పదని హెచ్చరించారు. ఆదివారం కడపలోని యూటీఎఫ్ భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు సహకరించారన్నారు. ఉద్యోగుల అండదండలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. గత పీఆర్సీ బకాయిలతో పాటు డీఏ, సరెండర్ లీవ్, ఏపీజీఎల్ఐ బకాయిలు చెల్లింపులకు నోచుకోలేదన్నారు. ప్రభుత్వ పథకాలను నిరంతరం ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్యోగులను ప్రభుత్వం విస్మరించడం తగదన్నారు. ఉద్యోగులకు జీవన్మరణ సమస్యగా ఉన్న సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షురాలు డి.సుజాత రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.రూతు ఆరోగ్య మేరి, నాయకులు డి.సుబ్బారావు, సూర్య కుమార్, హిఫాజతుల్లా, శేషగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి

ముద్దనూరు : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామ సమీపంలో ఓ డాబా వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు పులివెందులకు చెందిన రవిశంకర్ అనే వ్యక్తి మోటార్‌బైక్‌లో వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. కిందపడిన క్షతగాత్రున్ని కొద్దిదూరం అలాగే లాక్కొని వెళ్లింది. దీంతో అతని చేతికి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పట్టపగలే చోరీ



చోరీ జరిగిన ఇంటిలో చెల్లా చెదరుగా పడిన వస్తువులను పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకటరమణ

రాజుపాళెం : మండల కేంద్రమైన రాజుపాళెం గ్రామంలో రెండు ఇళ్లల్లో పట్టపగలే దొంగలు చోరీకి పాల్పడ్డారు. రాజుపాళెం ఎస్ఐ వెంకటరమణ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామంలోని గోపిరెడ్డి సుస్మిత, ప్రభావతి ఇళ్లల్లో దొంగలు పడ్డారు. ప్రభావతి ఇంటిలో దొంగలకు ఏమీ లభించకపోవడంతో అక్కడి నుంచి వారు గోపిరెడ్డి సుస్మిత ఇంటికి వెళ్లారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో ఇంటి తలుపులకు ఉన్న బీగాలను పగులగొట్టారు. బీరువాను పగులగొట్టి దుస్తులను చెల్లాచెదురుగా వేసి 5 తులాల బంగారు దొంగిలించినట్లు సుస్మిత ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఎస్ఐ వెంకటరమణ, ఏఎస్ఐలు రామకృష్ణారెడ్డి, సిద్ధయ్య, పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. దొంగతనం జరిగిన ఇంటిలో క్లూస్ టీం వేలిముద్రలు సేకరించారు సంఘటనపై గోపిరెడ్డి సుస్మిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వడ్డీ రహిత రుణాలే అమానత్ బ్యాంక్ లక్ష్యం



మాట్లాడుతున్న ఏఐ ఇస్లామిక్ ఫైనాన్స్ కార్యదర్శి అబ్దుల్ రఖీబ్

కడప వైఎస్సార్ సర్కిల్ : నిరుపేదలకు వడ్డీ రహిత రుణాలు అందజేయడమే అమానత్ బ్యాంక్ ముఖ్య ఉద్దేశమని ఆల్ ఇండియా ఇస్లామిక్ ఫైనాన్స్ కార్యదర్శి జనాబ్ అబ్దుల్ రఖీబ్ తెలిపారు. ఆదివారం కడప నగరంలో అమానత్ మ్యూచువల్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మూడో వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్న నిరుపేదలకు వడ్డీ రహిత రుణాలు అందజేసి వారు ఆర్థికంగా కుదుటపడేందుకు, వ్యాపారాలు వృద్ధి చేసుకునేందుకు ఈ బ్యాంకు కృషి చేస్తుందన్నారు. 2019లో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ఇస్లామిక్ బ్యాంక్ ఆవశ్యకతను తీసుకెళ్లామన్నారు. ఆయన స్పందించి ఆనాటి మేనిఫెస్టోలో ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేసేందుకు అంగీకారం తెలిపారన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వమే అధికారంలో ఉండటంతో ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు విషయాన్ని ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముతీకుర్రహ్మాన్, సంఘ సేవకులు సల్లావుద్దీన్, కడప ఇస్లామిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ముక్తార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మా స్థలం ఆక్రమణకు యత్నిస్తున్నారు

– న్యాయం చేయాలని ఒంటరి మహిళ వేడుకోలు



మీడియాతో మాట్లాడుతున్న ఇందిరానగర్‌కు చెందిన ఒంటరి మహిళ

కడప కార్పొరేషన్ : కడప నగర శివార్లలోని ఇందిరానగర్‌లో సర్వే నంబర్ 715లో 112 ప్లాట్ నంబర్‌లో తాము పదేళ్లుగా పొజిషన్‌లో ఉన్నామని, ఇప్పుడు వేరేవాళ్లు వచ్చి ఆ స్థలం తమదంటున్నారని ఒంటరి మహిళ రఖీబ్ జాన్ ఆవేదన వ్యక్తం చేసింది. శనివారం ఉదయం కొంతమందిని పోగేసుకొని వచ్చి తమ స్థలంలో ఉన్న రేకుల షెడ్డును దౌర్జన్యంగా తొలగించారని వాపోయింది. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ 2010లో తమ తల్లి ఖాతూన్ బీ పేరుతో రెవెన్యూ అధికారులు పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చారని, ఆ స్థలంలో తాము బేస్‌మట్టం వేసుకొని రేకుల షెడ్డు, కట్టెలు ఏర్పాటు చేసుకొని ఉన్నామన్నారు. 2018లో ఖాతూన్ బీ మరణించడంతో ఆమె కుమార్తెగా తాను ఆ స్థలాన్ని కాచిపెట్టుకొని ఉన్నానన్నారు. కాగా ఇటీవల రైల్వేకోడూరుకు చెందిన రుద్రరాజు శంకర్‌రాజు అనే వ్యక్తి పోలీస్ కానిస్టేబుల్‌నని చెబుతూ ఆ స్థలం తన భార్య రుద్రరాజు లక్ష్మీదేవి పేరున ఉందని మరొక పొజిషన్ సర్టిఫికెట్ తీసుకొచ్చారన్నారు. దీనిపై పోలీసులను ఆశ్రయించగా వారు రిపోర్టు కోసం రెవెన్యూ వారికి రాశారన్నారు. ఆ నివేదిక ఏదీ తమకు ఇవ్వకుండానే తమ స్థలంలోకి వచ్చి దౌర్జన్యంగా రేకుల షెడ్ తొలగించడం అన్యాయమన్నారు. రెవెన్యూ అధికారులు విచారణ చేసి ఎన్నో ఏళ్లుగా పొజిషన్‌లో ఉన్న తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేష్మ పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత



రక్తదాతను అభినందిస్తున్న డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, డీఎంహెచ్ఓ నాగరాజు తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రక్తదానం సామాజిక బాధ్యతగా భావిస్తూ ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా రక్త వారోత్సవాల రెండో వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం మొదటిరోజు కడప నగరం బాలాజీ నగర్‌లో జేబీవీఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్వో, డీఎంహెచ్ఓ, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం అనేది అత్యంత పవిత్రమైన సేవా కార్యక్రమమన్నారు. రానున్న రోజుల్లో వర్షాకాల ప్రభావం వల్ల రక్త అవసరాలు పెరగనున్న తరుణంలో స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న ఈ రక్తదాన శిబిరాలు ఎంతో సహాయపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు అశోక్, సభ్యులు ఈశ్వరయ్య, వికసిత ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మీదేవి, వెంకటనారాయణ రెడ్డి, ప్రభుత్వ సిబ్బంది, డాక్టర్ ఓ.వి.రెడ్డి, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ రంగనాథరెడ్డి, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, ఇతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రక్తదాతలు పాల్గొన్నారు.

జేబీ ఆసుపత్రిలో ట్యూమర్ ప్రొసెస్ సర్జరీ విజయవంతం



పేషెంట్ మహబూబ్‌చాన్‌తో డాక్టర్ జహంగీర్‌బాషా

కడప రూరల్ : కడప నగరంలోని జేబీ ఆసుపత్రిలో ట్యూమర్ ప్రొసెస్ సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ జహంగీర్‌బాషా వివరాలను వెల్లడించారు. చాగలమర్రికి చెందిన వృద్ధురాలు మహబూబ్‌చాన్ మోకాలి ఆపరేషన్ చేయించుకొని, చీము పట్టి నడవలేని స్థితిలో ఉండేవారని పేర్కొన్నారు. ఆమె జేబీ ఆసుపత్రికి రావడంతో వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ పరీక్షల్లో ఎముక పూర్తిగా పాడైపోయినట్లు ధృవీకరించామని తెలిపారు. ఆమె 120 కేజీల బరువు ఉండడం చేత సర్జరీ చేయడం కష్టంగా మారిందన్నారు. పూర్తిగా చెడిపోయిన 25 సెంటీ మీటర్ల ఎముకను తొలగించి, దాని స్థానంలో ఇంప్లాంట్‌ను అమర్చామని తెలిపారు. హైదరాబాద్ నుంచి ట్యూమర్ ప్రొసెస్ తెప్పించి సర్జరీని విజయవంతంగా నిర్వహించడంతో పాటు పేషెంట్‌ను మరుసటి రోజే నడిపించామన్నారు. ఇలాంటి ఆపరేషన్లు చాలా అరుదుగా జరుగుతుంటాయని పేర్కొన్నారు. ఆసుపత్రి ఎండీ డాక్టర్ జయభారతి మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో లభించే అధునాతన వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేషెంట్ మహబూబ్‌చాన్ మాట్లాడుతూ సర్జరీ తరువాత ఆరోగ్యంగా ఉన్నానని, అందరిలా నడవగలుగుతున్నానని తెలిపారు.

బీజేపీకి తొత్తుగా ఎన్నికల కమిషన్

కడప వైఎస్సార్ సర్కిల్ : ఎన్నికల కమిషన్ బీజేపీ ప్రభుత్వానికి తొత్తుగా పని చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ ఆరోపించారు. ఆదివారం కడప నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం బీహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) కు ఆదేశించిందన్నారు. ఇప్పుడు, ఈ ప్రక్రియను దేశం మొత్తానికి విస్తరించాలని ఎన్నికల కమిషన్ కోరుకుంటోందన్నారు. ఓటర్ల జాబితాలను సవరించడం పేరుతో ఓటర్ల పౌరసత్వాన్ని ధ్రువీకరించే అధికారాన్ని వినియోగించుకుంటోందన్నారు. ఓటర్ల జాబితా నుంచి విదేశీయులను తొలగించాలనే నిరాధారమైన సాకుతో, వారు మైనారిటీలలోని విస్తారమైన వర్గాలను, ఇతర ఎంపిక చేసిన సమూహాలను ఓటు హక్కును హరించేందుకు కుట్రపన్నారన్నారు. కోవిడ్ మహమ్మారికి ముందు ప్రజలు విస్తృతంగా వ్యతిరేకించిన ఎన్.ఆర్.సి. కసరత్తును వెనుక తలుపు ద్వారా రహస్యంగా అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించిన ఎన్నికల కమిషన్ ఇప్పుడు సంఘ్ పరివార్ ఎజెండాను అమలు చేయడంలో భాగస్వామిగా మారిందన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యకు నిరసనగా ఆగస్టు 8న దేశవ్యాప్తంగా నిరసనలు నిర్వహించాలని సీపీఐ(ఎం) పిలుపునిచ్చిందని తెలిపారు.